

ప్రజాభీష్టం
# ఈమాట
తెలుగు దినపత్రిక

గురువారం
13 ఆగస్టు 2026

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం

www.eemaatadaily.com | follow on :

పేజీలు: 04






- నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలి
- నీటిమట్టం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- ప్రాజెక్టు నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలి
- 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సరఫరా
- అధికారులతో కలెక్టర్ అంకిత్
- ఏకలవ్య మోడల్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

# 'తాలిపేరు'ను సందర్శించిన కలెక్టర్ అంకిత్

**చర్ల, ఈమాట**

చర్లలోని తాలిపేరు ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ప్రాజెక్టులోని ప్రస్తుత నీటిమట్టం, నీటి ప్రవాహం, నీటి విడుదల, నిర్వహణ, సిబ్బంది వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 73.80 మీటర్ల నీటిమట్టం ఉందని, పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లు అని అధికారులు వివరించారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి ప్రాజెక్టుకు ప్రధానంగా నీటి ప్రవాహం వస్తుందని, గత ఏడాదితో పోలిస్తే ఈసారి ప్రవాహం తక్కువగా ఉందని తెలిపారు. ప్రస్తుతం సుమారు 2,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని, రానున్న రోజుల్లో ఇది మరింత తగ్గే అవకాశం ఉందని వివరించారు. ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు విడుదల చేస్తున్న నీటి వివరాలను కూడా కలెక్టర్ తెలుసుకున్నారు.

04

## గిరిజన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలి
- ఉద్దీపకం-3ను సమర్థవంతంగా అమలు చేయాలి
- ఐటీడీఏ పీవో బి.రాహుల్

04




## రెచ్చిపోతున్న దొంగలు

### పాల్వంచలో వరుస చోరీలు

04



## విద్యార్థి ఉద్యమాల దిక్సూచి ఏఐఎస్ఎఫ్

**సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎస్కే సాబీర్ పాషా**



**ములకలపల్లి - ఈమాట:** విద్యార్థి ఉద్యమాలకు ఏఐఎస్ఎఫ్ దిక్సూచిగా నిలుస్తోందని సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎస్కే సాబీర్ పాషా అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 1936 ఆగస్టు 12న బ్రిటిష్ పాలన నుంచి దేశానికి విముక్తి కోసం విద్యార్థులను ఏక తాటిపైకి తీసుకురావాలనే లక్ష్యంతో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏర్పడిందని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. విద్యారంగ సమస్యలపై విద్యార్థులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని, యువతకు ఉపాధి అవకాశాల కోసం భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు




**పాల్వంచ రూరల్ - ఈమాట:** పాల్వంచ మండలం పాండురంగాపురం తండాలో వైఆర్‌జీ కేర్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుసంధాన కార్యకర్త ఎస్.రోజా మాట్లాడుతూ హెచ్ఐవీ సాధారణ స్పర్శ ద్వారా వ్యాపించదని, నాలుగు ప్రధాన మార్గాల ద్వారా మాత్రమే వ్యాపిస్తుందని వివరించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిపై వివక్ష చూపకుండా గౌరవంగా చూడాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం ఎయిడ్స్ సహాయవాణి 1097ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనుసంధాన కార్యకర్త ఎస్.రోజా, స్వచ్ఛంద సేవకురాలు ఏ.రుక్మా, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్వార్టర్స్ కేటాయింపునకు కౌన్సిలింగ్



**రామవరం - ఈమాట:** సింగరేణి కొత్తగూడెం ఏరియాకు చెందిన ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల క్వార్టర్స్ కేటాయింపునకు సంబంధించి బుధవారం రుద్రంపూర్‌లోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో సీనియారిటీ ప్రాతిపదికన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్‌సీ, ఎంసీ, ఎంహెచ్, సీ2, టీ2, ఎండీ, ఎన్‌బీ, ఏ–టైప్ క్వార్టర్స్ కేటాయింపు ప్రక్రియను యాజమాన్యం, కమిటీ సభ్యులు, యూనియన్ ప్రతినిధులు, సంబంధిత అధికారుల సమక్షంలో నిర్వహించారు. క్వార్టర్స్ కేటాయింపు విధానం, అర్హతలు, ప్రాధాన్యత క్రమాన్ని ఉద్యోగులకు వివరించారు. మొత్తం 59 మంది ఉద్యోగులు కౌన్సిలింగ్‌కు నమోదు చేసుకోగా 14 మంది క్వార్టర్స్ ఎంపిక చేసుకున్నారు. 36 మంది గైర్హాజరు కాగా, 9 మంది ఆసక్తి చూపలేదు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం ఎం.గోవిందరావు, పర్సనల్ మేనేజర్ ఎల్.తిరుపతి, ఏజీఎం (సివిల్) రామకృష్ణ, డీవైపీఎం జి.హరీష్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి.రజాక్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### కాళ్లు, చేతులు కోల్పోయిన ఈడమయ్యకు

# బ్యాటరీ వీల్‌చైర్ అందజేత

**రూ.లక్ష విలువైన వీల్‌చైర్ అందజేసిన ఐటీడీఏ పీవో బి.రాహుల్**

**చిరు వ్యాపారం కోసం రూ.50 వేల ఆర్థిక సాయం**



**భద్రాచలం, ఈమాట:** చర్ల మండలం బక్కచింతలపాడు గ్రామానికి చెందిన మడకం ఈడమయ్యకు ఐటీడీఏ పీవో బి.రాహుల్ రూ.లక్ష విలువైన బ్యాటరీ వీల్‌చైర్ అందజేశారు. ఆరు సంవత్సరాల క్రితం రాడ్ బైండింగ్ పనిలో విద్యుత్ ప్రమాదానికి గురై రెండు చేతులు, రెండు కాళ్లు కోల్పోయిన ఈడమయ్య పరిస్థితిని తెలుసుకుని ఈ సహాయం చేసినట్లు తెలిపారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్, న్యాయవాదులు, గ్రామస్తుల సమక్షంలో వీల్‌చైర్ అందించారు. కుటుంబ పోషణ కోసం చిరు వ్యాపారం చేసుకునేందుకు వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా రూ.50 వేల ఆర్థిక సాయం అందిస్తామని రాహుల్ తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, న్యాయవాదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# సేవా కార్యక్రమాలు చేయడమే నా లక్ష్యం

**ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ పాత్రికేయుడు దుర్గం ప్రేమ్‌కుమార్**

**పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ**



**కరకగూడెం - ఈమాట:** తన పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర విద్యా సామగ్రిని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ పాత్రికేయుడు దుర్గం ప్రేమ్‌కుమార్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తనను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం అధ్యయనం చేస్తున్నానని, ప్రతి సంవత్సరం తన పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక ప్రదర్శనల ఎంపికలు



**రామవరం - ఈమాట:** సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో ఈనెల 15న కొత్తగూడెం ప్రకాశం స్టేడియం మైదానంలో నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రధాన వేడుకల్లో ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాల ఎంపికలు బుధవారం కొత్తగూడెం చిల్డ్రన్స్ పార్క్‌లో నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ప్రదర్శనల అనంతరం మెరుగైన ప్రదర్శన కోసం ఉపాధ్యాయులకు అవసరమైన మార్పులు, చేర్పులు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డీవైపీఎంలు కే.శివకుమార్, కే.సునీల్‌కుమార్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ ఎం.సి.ఫాస్నెట్, సేవా కోఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, స్కౌట్స్ అండ్ గైడ్స్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత



**కరకగూడెం - ఈమాట:** కరకగూడెం మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కొమరం లక్ష్మీబాయి కుమారుడు కొమరం రామ్‌గోపాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య, పార్టీ శ్రేణులు బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రావుల సోమయ్య మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు కష్టసుఖాల్లో బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం రామ్‌గోపాల్ దశదిన కర్మలకు ఉపయోగపడేలా కుటుంబానికి 50 కేజీల బియ్యం, ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు కొమరం సత్యనారాయణ, వట్టం సందీప్, మండల నాయకులు బుడగం రాము, బైరిశెట్టి చిరంజీవి, గుడ్ల రంజిత్, కటకం లెనిన్, యల్లి రామకృష్ణారెడ్డి, గొగ్గల నరసయ్య, యగ్గడి శ్రీను, పోలెబోయిన దిలీప్, రాజశేఖర్, గొంది పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం



**ఆళ్లపల్లి - ఈమాట:** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో రెండో దశ పోరాటంలో భాగంగా ఆళ్లపల్లి తహసీల్దార్ గద్దం ఉమా రాణికి నాయకులు మెమోరాండం అందజేశారు. టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హతీరామ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని తెలిపారు. పీఆర్‌సీని 2023 జూలై 1 నుంచి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. బీఈడీ అర్హత కలిగిన ఎస్‌జీటీలకు సీనియారిటీ ప్రకారం పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాం ఏచూరి జయంతి



**దమ్మపేట - ఈమాట:** సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి 74వ జయంతి సందర్భంగా బుధవారం దమ్మపేటలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు మాట్లాడుతూ మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడిగా, సీపీఎం కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని గుర్తుచేశారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా ప్రజల సమస్యలపై పోరాడారని తెలిపారు. కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్యవతి, ఈశ్వరమ్మ, సత్యవేణి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రంథ పాలకుల దినోత్సవం




**భద్రాచలం - ఈమాట:** భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఈ–గ్రంథాలయ గదిలో గ్రంథ పాలకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీర్తిశేషులు ఎస్.ఆర్. రంగనాథన్ జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రంథ పాలకుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలు, సమాచార వనరుల ద్వారా విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడంలో గ్రంథ పాలకుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి బి. సుధాకర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ హవిలా, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు కంకరను తప్పించబోయి
# రెండు ట్రాక్టర్లు బోల్తా



**పాల్వంచ టౌన్-ఈమాట:** పాల్వంచలోని రెజీనా స్కూల్ ముందు పైప్‌లైన్ పనులు జరుగుతున్న ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న కంకరను తప్పించబోయి రెండు ట్రాక్టర్లు డివైడర్‌పైకి ఎక్కి బోల్తా పడ్డాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే అదే సమయంలో పెద్ద వాహనాలు, ద్విచక్ర వాహనాలు వచ్చినట్లయితే భారీ ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేపట్టే సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జగన్నాథపురం నుంచి కలెక్టరేట్ వరకు జాతీయ రహదారిపై ఇలాంటి నిర్లక్ష్యం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని రహదారిపై అడ్డంకులను తొలగించి భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# సాదా బైనామాల పరిష్కారంలో రెవెన్యూ శాఖ పనితీరు శూన్యం

### భారతీయ గోర్ బంజారా పోరాట సమితి నాయకులు



**చంద్రుగొండ - ఈమాట:** రాష్ట్రవ్యాప్తంగా సాదా బైనామాలకు సంబంధించి 9 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చినా.. ఇప్పటివరకు 10 శాతం కూడా పరిష్కరించలేదని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతీయ గోర్ బంజారా పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ రవినాయక్ మాట్లాడుతూ.. భూ భారతి అమల్లోకి వచ్చిన తర్వాత సాదా బైనామాల పరిష్కార నిబంధనల్లో మార్పులు చేసి, బాధ్యతలను ఆర్డీవోలకు అప్పగించినా పెండింగ్ దరఖాస్తులు పరిష్కారం కావడం లేదన్నారు. పెండింగ్ దరఖాస్తులపై సమగ్ర విచారణ జరిపి త్వరగా పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని తెలిపారు. రైతులు పదేపదే దరఖాస్తులు చేసుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని బంజారా నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అడవి జంతువుల వేటకు అమర్చిన విద్యుత్ తీగ తగిలి ఎఫ్‌బీఓ మృతి

**బూర్గంపహాడ్–ఈమాట:** నకిరేపేట గ్రామ పరిధిలో అడవి జంతువుల వేట కోసం అక్రమంగా అమర్చిన విద్యుత్ తీగ తగిలి అటవీశాఖ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) బానోతు నవీన్ మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి అడవి జంతువులను వేటాడేందుకు కొంతమంది విద్యుత్ తీగలు అమర్చినట్లు సమాచారం అందడంతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లారు. వేటగాళ్ల కోసం గాలిస్తుండగా వేట కోసం అమర్చిన విద్యుత్ తీగ తగిలి ఎఫ్‌బీఓ నవీన్ మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ఘటనపై అటవీశాఖ అధికారులు బుధవారం ఉదయం బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పాల్వంచ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ దర్యాప్తు చేస్తున్నారు.

### బూర్గంపహాడ్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా
## ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



**బూర్గంపహాడ్ - ఈమాట:** బూర్గంపహాడ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్‌గా జి. ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎల్‌డీసీ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## 'చేయూత' పెన్షన్లకు దరఖాస్తుల ఆహ్వానం

### బూర్గంపాడు ఎంపీడీవో జమలారెడ్డి



**ఈమాట – బూర్గంపాడు:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'చేయూత' పెన్షన్ పథకానికి అర్హులైన వారు ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవ చ ౖని బూర్రంపాడు ఎంపీడీవో జమలారెడ్డి తెలిపారు. అర్హులు సంబంధిత గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వితంతువులు 18 ఏళ్లు పైబడి ఉండి భర్త మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఒంటరి మహిళలు 18 ఏళ్లు పైబడి ఉండి, భర్త వదిలేసిన వారు లేదా విడాకులు పొందిన వారు అర్హులు. దివ్యాంగులకు కనీసం 40 శాతం వైకల్యం ఉండాలి. కళాకారులు, చేతివృత్తుల కార్మికులు 50 ఏళ్లు పైబడి సంబంధిత శాఖ ధ్రువీకరణ కలిగి ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫైలేరియా బాధితులు, గుర్తింపు పొందిన డయాలసిస్ కేంద్రాల్లో చికిత్స పొందుతున్న డయాలసిస్ బాధితులు కూడా అర్హులని ఎంపీడీవో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 31లోగా దరఖాస్తులు సమర్పించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### మాదిగ జాతి కోసం జీవితాన్ని అంకితం చేసిన కొప్పుల తిరుపతి మాదిగ

**భద్రాచలం - ఈమాట:** మాదిగ జాతి అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం జీవితాన్ని అంకితం చేసిన ఉద్యమ నాయకుడు కొప్పుల తిరుపతి మాదిగ మృతికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ భద్రాచలం నియోజకవర్గ నాయకులు ఘన నివాళులర్పించారు. గత 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ నిర్మాణంలో, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యమ విస్తరణకు కొప్పుల తిరుపతి మాదిగ కీలకంగా పనిచేశారని గుర్తుచేశారు. పాదయాత్రలు, సైకిల్ యాత్రలు, దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు, జైలు నిర్బంధాలు వంటి అనేక పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు.

# ‘తాలిపేరు’ను సందర్శించిన కలెక్టర్ అంకిత్

- నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలి
- నీటిమట్టం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- ప్రాజెక్టు నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలి
- 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సరఫరా
- అధికారులతో కలెక్టర్ అంకిత్
- ఏకలవ్య మోడల్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



**చర్ల, ఈమాట:** చర్లలోని తాలిపేరు ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ప్రాజెక్టులోని ప్రస్తుత నీటిమట్టం, నీటి ప్రవాహం, నీటి విడుదల, నిర్వహణ, సిబ్బంది వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 73.80 మీటర్ల నీటిమట్టం ఉందని, పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లు అని అధికారులు వివరించారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి ప్రాజెక్టుకు ప్రధానంగా నీటి ప్రవాహం వస్తుందని, గత ఏడాదితో పోలిస్తే ఈసారి ప్రవాహం తక్కువగా ఉందని తెలిపారు. ప్రస్తుతం సుమారు 2,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని, రానున్న రోజుల్లో ఇది మరింత తగ్గే అవకాశం ఉందని వివరించారు. ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు విడుదల చేస్తున్న నీటి వివరాలను కూడా కలెక్టర్ తెలుసుకున్నారు. ఎడమ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తాలిపేరు ప్రాజెక్టు ద్వారా సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతున్నట్లు వివరించారు. ప్రాజెక్టులో పనిచేస్తున్న సిబ్బంది, వారి విధులు, నిర్వహణకు అవసరమైన సిబ్బంది వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, గేట్ ఆపరేటర్లు, పంప్ ఆపరేటర్లను శాశ్వత ప్రాతిపదికన కేటాయించాలని అధికారులు కోరారు. అనంతరం ప్రాజెక్టు కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ గేట్ల నిర్వహణ, నీటి ప్రవాహం, నీటిమట్టం పర్యవేక్షణపై వివరాలు తెలుసుకున్నారు. నీటి ప్రవాహంలో మార్పులను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు గేట్లు, కంట్రోల్ రూమ్, ఇతర యంత్రాంగం నిరంతరం పనిచేసేలా నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి లభ్యతపై ముందస్తు ప్రణాళిక అవసరమన్నారు. భవిష్యత్‌లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రాజెక్టు నీటిమట్టం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

### ఏకలవ్య మోడల్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

తాలిపేరు ప్రాజెక్టు సందర్శన అనంతరం చర్లలోని ఏకలవ్య మోడల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వసతులు, భోజనం, వైద్య సేవలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను తెలుసుకుని, వారితో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగారు. విద్యార్థుల నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను పరిశీలించి, కొందరితో చదివించి వారి అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. పాఠశాల వంటగదిని పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత, వంట విధానం, కూరగాయలు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని, భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలోని ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అందుబాటులో ఉన్న మందులు, ఆరోగ్య పరీక్షలు, విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలపై ఏఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కలెక్టర్ వెంట చర్ల తహసీల్దార్, ఇరిగేషన్, విద్యాశాఖ, ఎంపీడీవో, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలి
- ఉద్దీపకం-3ను సమర్థవంతంగా అమలు చేయాలి
- ఐటీడీఏ పీవో బి.రాహుల్




**భద్రాచలం, ఈమాట:** గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ సూచించారు. బుధవారం భద్రాచలం బీఈడీ కళాశాలలో ఉద్దీపకం–3పై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసేలా బోధన ఉండాలని సూచించారు. ఉద్దీపకం–3 వర్క్‌బుక్ ద్వారా గణితాన్ని సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, పుస్తకాలకే పరిమితం కాకుండా చిత్రాలు, బోధన సామగ్రి, కార్యకలాపాలు, రోజువారీ ఉదాహరణలను ఉపయోగించాలని తెలిపారు. నెమ్మదిగా నేర్చుకునే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. శిక్షణలో నేర్చుకున్న బోధనా పద్ధతులను పాఠశాలల్లో అమలు చేసి విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.చందన, ఏసీఎంవో బి.రమేష్, ఖమ్మం ఏసీఎంవో రాములు, బీఈడీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భవాని, ఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఐటీడీఏ స్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా చూడాలి

## ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం, ఈమాట:** గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈనెల 13న నిర్వహించే ఐటీడీఏ స్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ సూచించారు. ఈనెల 7న ఆశ్రమ పాఠశాలల స్థాయిలో, 11న ఏటీడీవో స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేసి 13న భద్రాచలం బీఈడీ కళాశాలలో ఐటీడీఏ స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు సురక్షితంగా తీసుకొచ్చి పోటీల్లో పాల్గొనేలా చూడాలని రాహుల్ సూచించారు.

# రెచ్చిపోతున్న దొంగలు

## పాల్వంచలో వరుస చోరీలు

**పాల్వంచ టౌన్ - ఈమాట:** పాల్వంచ పట్టణంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో వరుస చోరీలు జరగడం కలకలం రేపుతోంది. గట్టాయిగూడెంలోని విద్యుత్ ఉద్యోగుల కాలనీలో కేటీపీఎస్ ఉద్యోగి మాడుగుల వెంకటేశ్వర్లు కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లి నాలుగు రోజుల అనంతరం బుధవారం తెల్లవారుజామున ఇంటికి తిరిగి వచ్చారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటాన్ని గుర్తించారు. గుర్తుతెలియని దుండగులు సుమారు ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు అపహరించినట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు పాల్వంచ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు పట్టణంలోని మార్కెట్ పరిధిలో ఓ వాణిజ్య సముదాయానికి చెందిన నాలుగు ఏసీ యూనిట్లు చోరీకి గురైనట్లు కేసు నమోదైంది. దుండగులు ఏసీ యంత్రాలను అపహరించినట్లు తెలుస్తోంది. పట్టణంలో వరుస చోరీలతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. రాత్రివేళల్లో పోలీసుల గస్తీని పెంచాలని ప్రజలు కోరుతున్నారు. రెండు ఘటనలపై



పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలిస్తున్నట్లు సమాచారం. కాగా, నలుగురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.